
సాక్షి అనకాపల్లి

ఆదివారం। 19। మార్చి। 2023



గిరి ఉత్పత్తులు 'సూపర్'

ఏజెన్సీలో సేకరించిన నాణ్యమైన ఉత్పత్తుల విక్రయాలకు సూపర్ మార్కెట్ ఏర్పాటు చేసే దిశగా జీసీసీ అడుగులు వేస్తోంది. 10లో



హరిత శోభ

డుంబ్రిగుడ: మండు వేసవిలోనూ హరిత శోభ నెలకొంది. రబీలో గిరి రైతులు చేపట్టిన వరి పైరు పచ్చదనంతో చూపరులను ఆకట్టుకుంటోంది.



స్నపన తిరుమంజనం

విశాఖ: రుషికొండలోని శ్రీ వేంటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

నూకాంబిక సన్నిధిలో అదనపు జిల్లా న్యాయమూర్తి



న్యాయమూర్తి సువర్ణరాజుకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఈవో చంద్రశేఖర్

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు నూకాంబిక అమ్మవారిని శనివారం విశాఖ అదనపు జిల్లా న్యాయమూర్తి సువర్ణరాజు దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.చంద్రశేఖర్ న్యాయమూర్తికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి గర్భాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందజేశారు. న్యాయమూర్తులు అమరరంగేశ్వరరావు, మహ్మద్ షేక్ అబూతలీబ్, జి.గంగరాజు, పి.ప్రదీప పాల్గొన్నారు.

33 ఎక్సైజ్ వాహనాలు వేలం



వేలం నిర్వహిస్తున్న ఏఈఎస్ రవికుమార్

నర్సీపట్నం: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 33 వాహనాలను స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌లో అనకాపల్లి ఏఈఎస్ రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం వేలం వేశారు. 33 ద్విచక్రవాహనాలకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రూ.2,95,800 ధర నిర్ణయించగా వేలంలో రూ.5,84,867 లభించినట్టు ఏఈఎస్ తెలిపారు. ఈ వేలంతో నర్సీపట్నం ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను క్లియర్ చేశామన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన వాహనాలు మాత్రమే ఉన్నాయని చెప్పారు. ఈ వేలంలో సీఐ శ్రీనివాస్, ఎస్ చంద్రశేఖరరావు, అధిక సంఖ్యలో పాటదారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు 11మంది విద్యార్థులు



యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చోడవరం రూరల్: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు చోడవరం పతంజలి యోగా శిక్షణ కేంద్రానికి చెందిన 11 మంది విద్యార్థులు ఎంపికైనట్టు కేంద్రం నిర్వాహకుడు పుల్లేటి సతీష్ శనివారం తెలిపారు. వివిధ వయసులకు చెందిన కె.హరికిరణ్, పి.వెన్నెలశ్రీ, పి.లయవర్ధన్, పి.పవన్‌కుమార్, వి.హరిదుర్గ, పి.క్రాంతి సాగర్, జి.హేమంత్ శ్రీను, పి.హరీష్, వి.పూర్ణచంద్రరావు, పి.సాయి సుధీర్, పి.నిఖిల్‌లు ఎంపికయ్యారని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ఆదివారం జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ఆయన చెప్పారు.

గౌరీపంచాయతన దేవస్థానం పట్టువస్త్రాల సమర్పణ



ఆలయ ఈవో చంద్రశేఖర్‌కు పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పణ

అనకాపల్లి టౌన్: స్థానిక గౌరీపంచాయతన దేవస్థానం తరపున ఆలయ కమిటీ సభ్యులు కొత్త అమావాస్యను పురస్కరించుకొని నూకాంబిక అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ అందజేశారు. దేవస్థానం నుంచి కోలాటాలు, అమ్మవారి సంకీర్తనలు, మేళతాళాల మధ్య శనివారం ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసిరావు, కార్యదర్శి బుద్ద రమణాజీ తదితరులు పాల్గొన్నారు.

సై



నేడు భారత్-ఆస్ట్రేలియా మధ్య వన్డే
1.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం

- రెట్టించిన ఉత్సాహంతో భారత్
- సిరీస్ సమం చేసేందుకు ఆస్ట్రేలియా..
- ఉత్కంఠలో క్రికెట్ అభిమానులు
- వరుణుడు ఆడుకుంటాడా?

విశాఖ స్పోర్ట్స్: భారత్‌లో పర్యటిస్తున్న ఆస్ట్రేలియా జట్టు సిరీస్‌లో రెండో వన్డే మ్యాచ్‌కు డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. ఇరు జట్ల ఆటగాళ్లు శనివారం విశాఖ చేరుకున్నారు. ఇదే పిచ్‌పై ఆస్ట్రేలియా జట్టును ఐదు వికెట్ల తేడాతో ఓడించిన భారత్ జట్టు మరోసారి విజయంతో పాటు సిరీస్‌ను సొంతం చేసుకునేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే వైఎస్సార్ స్టేడియంలో భారత్ జట్టు పది వన్డే మ్యాచ్‌లాడగా ఓ మ్యాచ్ రద్దయింది. ఓ మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. 8 వన్డేల్లో ఓసారి వెస్టిండీస్ జట్టు విజయం సాధించగా.. భారత్ మిగిలిన ఏడు మ్యాచ్‌ల్లో విజయకేతనం ఎగురవేసింది. మొత్తానికి ఆతిథ్య జట్టుకు అచ్చొచ్చిన స్టేడియంగా మారింది. మూడున్నరేళ్ల తర్వాత ఇక్కడ వన్డే మ్యాచ్ జరుగుతుండటంతో అభిమానుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

ఇక్కడ టాస్ కీలకం

స్టేడియంలోని సెంటర్ పిచ్‌పై ఆదివారం మ్యాచ్ జరగనుండగా పెద్దగా బౌన్స్ కాకుండా ఉండే ఈ పిచ్ స్పిన్నర్లకు అనుకూలించే అవకాశం ఉంది. జరిగిన ఎనిమిది మ్యాచ్‌ల్లోనూ మూడుసార్లు మాత్రమే లక్ష్య నిర్దేశ జట్టు విజయం సాధించగా ఐదుసార్లు లక్ష్య ఛేదన జట్టే విజయం సాధించాయి. దీంతో భారత్, ఆస్ట్రేలియా జట్లకు టాస్ కీలకం కానుంది. తొలి మ్యాచ్‌లో విజయంతో భారత్ విశాఖలోనే సిరీస్ సాధించాలనే పట్టుదలతో బరిలోకి దిగుతోంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి పట్టు నిలుపుకునేందుకు ఆస్ట్రేలియా జట్టు సిద్ధమవుతోంది.

వర్షం వస్తే...

అల్పపీడన ద్రోణితో విశాఖలో వాతావరణం చల్లబడింది. శనివారం చిరుజల్లులు కురిశాయి. దీంతో స్టేడియం అంతటా కవర్లు కప్పి ఉంచారు. పిచ్‌తో పాటు ఔట్‌ఫీల్డ్‌లోనూ కవర్లతో మ్యాచ్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేశారు. చినుకులు పడినా మ్యాచ్‌కు పెద్దగా అంతరాయం ఉండదు. స్టేడియం ఔట్‌ఫీల్డ్‌లో నీరు వెంటనే పోయేందుకు అత్యాధునిక డ్రైనేజ్ వ్యవస్థ ఇక్కడ అందుబాటులో ఉంది. ఎడతెరిపి లేకుండా వర్షం కురిస్తేనే మ్యాచ్‌పై ప్రభావం ఉంటుంది. ఇక మ్యాచ్ షెడ్యూల్‌కు రెండు గంటల ముందునుంచే స్టేడియంలోకి ఆయా ప్రవేశ ద్వారాల నుంచి అనుమతించనున్నారు.

విశాఖ చేరుకున్న భారత్-ఆస్ట్రేలియా జట్లు



గోపాలపట్నం: భారత్-ఆస్ట్రేలియా జట్ల క్రికెటర్లు శనివారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖ చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయం టెర్మినల్ లోపల ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి, స్వాగత కమిటీ అధ్యక్షుడు జియ్యాని శ్రీధర్ క్రికెటర్లను పుష్పగుచ్ఛాలు, గులాబీలు అందించి స్వాగతం పలికారు. నూతన ఇంటర్నేషనల్ టెర్మినల్ భవనం నుంచి క్రికెటర్లు బయటకు వచ్చారు. అప్పటికే చిరుజల్లులు కురుస్తుండటంతో.. క్రికెటర్లు వర్షంలోనే తడుస్తూ వారికి కేటాయించిన బస్సుల్లో హోటల్‌కు చేరుకున్నారు. అలాగే ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లో సునీల్ గవాస్కర్‌కు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఘన స్వాగతం పలికారు.



ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా చిరంజీవి

- రెండో ప్రాధాన్యత ఓటుతో విజయం
- బీజేపీ, పీడీఎఫ్‌లతో బయటపడిన టీడీపీ బంధం
- వారి ద్వారానే మెజార్టీ సాధించిన టీడీపీ అభ్యర్థి



చిరంజీవిరావుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: మూడు శక్తులు ఏకమైనా ఏ ఒక్కరికీ పూర్తి మెజార్టీ రాలేదు. ఆ శక్తుల ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తే గాని విజయం దక్కలేదు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, పీడీఎఫ్ (వామపక్షాలు)ల మధ్య బంధాలు మరోసారి బయటపడ్డాయి. బయటకు ఏ పార్టీకి ఆ పార్టీ పోటీ చేస్తున్నట్లు కలరింగ్ ఇస్తూనే.. ఎన్నికల ప్రచారంలో మాత్రం లోపాయికారీ ఒప్పందాలకు తెరలేపారు. వీరి అప్రకటిత పొత్తులు, బంధాలు ఓట్ల లెక్కింపులో బహిర్గతమయ్యాయి. ఆ మూడు పార్టీల అక్రమ బంధాలు, పొత్తులు, రెండో ప్రాధాన్యత ఓట్లతో కలుపుకొని టీడీపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు విజయం సాధించారు. ఆయన విజయాన్ని నిర్ధారిస్తూ శనివారం ఉదయం రిటర్నింగ్ అధికారి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

మొదటి ప్రాధాన్య ఓట్లలో రాని మెజార్టీ

ఈనెల 16వ తేదీన ప్రారంభమైన ఓట్ల లెక్కింపులో మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఏ ఒక్కరికీ పూర్తిస్థాయి మెజార్టీ రాలేదు. విజయానికి 94,509 ఓట్లు కావాల్సి ఉంది. అయితే టీడీపీ మద్దతు అభ్యర్థికి 82,958 ఓట్లు, వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కి 55,749 ఓట్లు వచ్చాయి. దీంతో శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించాల్సి వచ్చింది. తక్కువ ఓట్లు సాధించిన స్వతంత్ర అభ్యర్థులను ఎలిమినేట్ చేసుకుంటూ.. మొత్తం 36 రౌండ్లలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. ఎలిమినేషన్ చేసిన 33 మంది ఇండిపెండెంట్ల ద్వారా 947 ఓట్లు.. బీజేపీ అభ్యర్థి మాధవ్ నుంచి 3,959 ఓట్లు, పీడీఎఫ్ అభ్యర్థి ద్వారా 6,645 ఓట్లు టీడీపీ అభ్యర్థి చిరంజీవిరావుకు రావడం గమనార్హం.

బీజేపీ, పీడీఎఫ్‌లతో టీడీపీ లోపాయికారీ ఒప్పందం

టీడీపీ, బీజేపీ, పీడీఎఫ్‌ల బంధం కౌంటింగ్‌లో స్పష్టమైంది. బీజేపీ, పీడీఎఫ్‌లకు పడిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓటు మాత్రం టీడీపీకే రావడం ఇందుకు నిదర్శనం. ఎన్నికల ప్రచారంలోనే లోపాయికారీ ఒప్పందానికి తెరలేపారు. ప్రచారంలో తొలి ప్రాధాన్యత ఓటు తమకే వేయాలని, రెండో ప్రాధాన్యత మాత్రం టీడీపీ అభ్యర్థికి వేయాలని బీజేపీ, పీడీఎఫ్ అభ్యర్థులు ప్రచారం చేశారు. టీడీపీ అభ్యర్థి విజయానికి అవసరమైన 11,551 ఓట్లలో బీజేపీ, పీడీఎఫ్‌ల నుంచే 10,604 ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు టీడీపీ అభ్యర్థికి రావడం గమనార్హం.

వీరాభిమాని రెడీ



అనకాపల్లి టౌన్: ఆయనొక క్రికెట్ వీరాభిమాని... విశాఖలో మ్యాచ్ జరిగినప్పుడల్లా తన అభిమానాన్ని విభిన్నంగా చాటుకుంటాడు. ఆయనే గవరపాలేనికి చెందిన పెతకంశెట్టి శ్రీనివాసరావు. ఆదివారం ఇండియా-ఆస్ట్రేలియా వన్డే మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో 'ఇండియా' షేపులో తన గెడ్డాన్ని షేవ్ చేసుకొని ఇండియా జెర్సీ ధరించి సమరానికి సై అంటున్నాడు.

ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ స్కూళ్లలో పేదలకు 25 శాతం సీట్లు

అనకాపల్లి టౌన్: ప్రభుత్వ జీవో 24 ప్రకారం జిల్లాలో ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ స్కూళ్లలో 2023–24 విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ పేర్కొన్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం ఐబీ (అంతర్జాతీయ), ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ మేనేజ్‌మెంట్ స్కూళ్లన్నింట్లో విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు పేదవర్గాల పిల్లలకు కేటాయించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు.

రారండోయ్ జాతర చూద్దాం...

శతకోటి చంద్రుల అపురూప కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందే నూకాంబిక అమ్మవారి రూపం భక్తులను పులకింపజేస్తుంది. అభయ ప్రదాయని, ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, భక్తులపాలిట కొంగుబంగారమైన అమ్మవారి దర్శన భాగ్యం కోసం లక్షలాదిమంది ఎదురు చూస్తుంటారు. ఎంత చూసినా తనివితీరని ఆ తల్లి రూపాన్ని మరోసారి తిలకించేందుకు భక్తులు మళ్లీ మళ్లీ వస్తుంటారు. కొత్త అమావాస్య జాతర మహోత్సవాల్లో దర్శించుకుంటే అదో ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అనుభూతి.



భక్తుల దర్శనార్థం క్యూలైన్లు, చలువ పందిళ్లు

- రేపు రాత్రి నూకాంబిక అమ్మవారి జాతర ప్రారంభం
- 21న కొత్త అమావాస్య వేడుకలు
- నెలరోజులపాటు అమ్మవారి ఆలయంలో సందడి
- ఉత్తరాంధ్ర నుంచి లక్షల సంఖ్యలో భక్తుల రాక
- ఆలయ అధికారుల విస్తృత ఏర్పాట్లు



నూకాంబిక అమ్మవారి ఆలయం

అనకాపల్లి టౌన్: నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఈనెల 21న మంగళవారం కొత్త అమావాస్య వేడుకలు జరగనున్నాయి. ఆ ముందు రోజు రాత్రి జాతర ప్రారంభం కానుంది. సోమవారం రాత్రంతా భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. విద్యుద్దీపాల వెలుగులో ఆలయ పరిసరాలు దేదీప్యమానంగా ముస్తాబయ్యాయి. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈనెల 21న కొత్త అమావాస్య, 22న ఉగాది, ఏప్రిల్ 19న నెల పండగ ఘనంగా నిర్వహించనున్నారు. దేవదాయశాఖాధికారులతోపాటు ఆలయ ఈవో చంద్రశేఖర్, ఆర్డీవో చిన్నికృష్ణలు స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జీవీఎంసీ, పోలీసు, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక శాఖాధికారులు తమ సిబ్బందిని సిద్ధం చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అమ్మవారిని దర్శించుకొని ఆలయ పరిసరాల్లో రోజంతా ఉండి సహపంక్తి భోజనాలు చేస్తారు. వారి కోసం చలువ పందిళ్లు, ఆలయంలో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎప్పటికప్పుడు మజ్జిగ, చిన్నారులకు పాలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు.



నూకాంబిక అమ్మవారు

నాటి కాకతాంబే... నేటి నూకాంబిక

సుమారు 600 ఏళ్ల క్రితం 1450వ సంవత్సరంలో నూకాంబిక అమ్మవారు తొలుత కాకతాంబగా ఇక్కడ వెలిశారు. ఆర్కాట్ నవాబు దగ్గర సైన్యాధిపతిగా పనిచేసిన కాకర్లపూడి అప్పలరాజు కళింగ ఆంధ్రప్రభువైన బహుబలేంద్రుడ్ని ఓడించి అనకాపల్లి కేంద్రంగా రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటి గవరపాలెం ప్రాంతంలో ఒక శత్రు దుర్భేద్యమైన కోటను నిర్మించి తమ ఇలవేల్పు కాకతాంబ గుడిని కోటకు దక్షిణంగా నిర్మించారు. తర్వాత రాజ్యం చేతులు మారి వైరిచర్ల ఆనంద గజపతిరాజు వంశీయులు దేవస్థాన శాశ్వతధర్మకర్తలుగా వ్యవహరించేవారు. నూకాంబిక అమ్మవారి దేవాలయం 1935లో దేవదాయశాఖ ఆధీనంలోకి వచ్చింది.

ట్రాఫిక్ కట్టుదిట్టం

కొత్త అమావాస్య జాతర నెల రోజులూ నిత్యం వేలాదిమంది భక్తులు దర్శించుకొంటారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన ఆదివారాలు లక్షమంది వంతున భక్తులు వచ్చే అవకాశమున్నందున ట్రాఫిక్‌ను కట్టుదిట్టం చేశారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న అమ్మవారి ముఖద్వారం, వన్‌వే ట్రాఫిక్ రోడ్డులోని చిననాలుగురోడ్ల జంక్షన్ వద్ద ముఖద్వారం, ఫూల్‌బాగ్ రోడ్లమీదుగా ఆలయంవైపు వాహనాలను అనుమతించరు.

నిత్యాన్నదానం

నూకాంబిక అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రతి రోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. భక్తులు మాలలు ధరించి అమ్మవారి పూజలో నిమగ్నమవుతారు. చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు ఒక రోజు రాత్రంతా నూకాంబిక అమ్మవారి పాటను ఏర్పాటు చేసుకొని ఉదయాన్నే వారింటి నుంచి కుటుంబసమేతంగా అమ్మవారి ఘటాలను మోసుకుంటూ కాలినడకన ఆలయానికి చేరుకుంటారు. వీరందరినీ దృష్టిలో పెట్టుకొని అన్నదానానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

పటిష్టమైన ఏర్పాట్లు



కొత్త అమావాస్య జాతరకు విజయనగరం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేశాం. నెలరోజులపాటు జరిగే జాతరకు అన్ని శాఖల అధికారుల సహకారాన్ని కోరాం. ఆలయ పరిసరాల్లో నెలంతా అగ్నిమాపక శకటాలు ఉంటాయి. పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశాం.

– ఎస్.సుజాత, జిల్లా దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్

ఆటో-బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు



గాయపడిన సాయి

గొలుగొండ : మండల కేంద్రంలో పెట్రోల్ బంక్ వద్ద ఆటో- బైక్ ఢీ కొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలివి. జోగుంపేట నుంచి గొలుగొండ బైక్‌పై వస్తున్న సాయి, కృష్ణదేవిపేట నుంచి గొలుగొండ మీదుగా పెసరాడ వెళుతున్న ఆటో పెట్రోల్ బంక్ వద్ద కుక్క అడ్డంగా రావడంతో దానిని తప్పించబోయి ఆటో- బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో బోల్తా పడి అందులో ఉన్న వీరాస్వామికి కాలు విరిగిపోయింది. బైక్‌పై ప్రయాణిస్తున్న సాయి మెడకు తీవ్రమైన గాయమైంది. మరో ఐదుగురు కూడా స్వల్పంగా గాయపడ్డారు. సాయిని నర్సీపట్నం తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు. గొలుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటాకిల్లు దగ్ధం

రాజవొమ్మంగి : కొమరాపురం గ్రామంలో శనివారం సంభవించిన అగ్నిప్రమాదంలో లోసుల రాజశేఖర్ (వలంటీర్) తాటాకిల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. విద్యుత్ వైర్ల ద్వారా మంటలు ఈ ఇంట్లోకి వ్యాపించినట్టు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. వెంటనే కరెంటు ఆపేసి గ్రామస్తులు మంటలను అదుపు చేశారు. కాగా అప్పటికే రాజశేఖర్ ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఆ సమయంలో భారీ వర్షం కురుస్తున్నా స్థానికులు మంటను ఆదుపుచేయలేకపోయారు. వర్షపు నీరు, చేతి పంపు బోర్ల నుంచి నీటిని తెచ్చి మంటలు ఇతర ఇళ్లకు వ్యాప్తి చెందకుండా యువకులు అదుపు చేశారు.

రూ.685 కోట్లతో చురుగ్గా జల్‌జీవన్ పనులు

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు

నాతవరం: జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.685 కోట్ల వ్యయంతో చేపట్టిన జల్‌జీవన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బి.వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2048 పనులకు ప్రభుత్వం రూ.685కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. పనులు పూర్తయితే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. జిల్లాలో 4,00,18,600 కుళాయిలు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యమని, ఇంతవరకు 2.50లక్షలకు పైగా కుళాయిలు ఏర్పాటు చేశామని తెలిపారు. మిగతా పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. నిబంధనల ప్రకారం చేసిన పనులకు రూ.88 కోట్లకుపైగా బిల్లులు చెల్లించినట్టు ఆయన చెప్పారు. వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. అన్ని మండలాల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా తాగునీటి పథకాలు, బోర్లు పరిశీలిస్తున్నట్టు చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నాతవరం మండలం సుందరకోట పంచాయతీ శివారు అసనగిరిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. జిల్లాలో ఇంకా ఎక్కడైనా తాగునీటి సమస్య ఉందని ప్రజాప్రతినిధులు మా దృష్టికి తీసుకువస్తే పరిశీలన చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో నర్సీపట్నం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.ప్రభాకరరావు ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, జెఈలు రాజేష్, వెంకటేశ్వరమ్మ, జోగారావు, వెలుగు ఏపీఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి పీహెచ్‌సీలో మంటలు

- దేవరాపల్లి పీహెచ్‌సీలో ఆక్సిజన్ కాన్సంట్రేటర్ దగ్ధం
- వాచ్‌మెన్‌కు త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



దేవరాపల్లి పీహెచ్‌సీలో దగ్ధమైన ఆక్సిజన్ కాన్సంట్రేటర్

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో శుక్రవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఒంటి గంట సమయంలో ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పీహెచ్‌సీ లోపల అంతటా దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో పీహెచ్‌సీలో విధి నిర్వహణలో ఉన్న స్టాఫ్ నర్స్ రాణి, వాచ్‌మెన్ రమణ తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌కు ఆనుకొని సిమెంట్ బల్లపై నిద్రిస్తున్న వాచ్‌మెన్ రమణ దుప్పటికి మంటలు వ్యాపించడంతో ఆందోళనతో పరుగు తీశాడు. స్టాఫ్ నర్స్, వాచ్‌మెన్ వెంటనే బకెట్లతో నీటిని తెచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఆక్సిజన్ కాన్సంట్రేటర్ దగ్ధమయ్యింది. బ్యాటరీలో షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగాయని పీహెచ్‌సీ సిబ్బంది చెబుతున్నారు. ఈ మంటల కారణంగా నాడు-నేడులో పీహెచ్‌సీకి వేసిన పెయింటింగ్ నల్లగా మారింది.

గ్యాస్ లీకై వ్యాపించిన మంటలు

ఎస్.రాయవరం : రేవుపోలవరం ఉన్నత పాఠశాల సమీపంలో తుపాన్‌షెల్టర్‌లో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఇక్కడ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తుండగా గ్యాస్‌లీకై మంటలు వ్యాపించడంతో నిర్వాహకులు, విద్యార్థులు ఆందోళన చెందారు. ఆపదమిత్ర శిక్షణ పొందిన వలంటీర్ వాసు మంటలు అదుపు చేశారు. కోడిగుడ్లు, బియ్యం అప్పటికే అగ్నికి ఆహుత య్యాయి. మంటలు వెంటనే అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పిందని ఎంఈవో మూర్తి తెలిపారు.

గాయపడ్డ రిటైర్డు టీచర్ మృతి



రిటైర్డ్ టీచర్ శ్రీరామ్మూర్తి

చోడవరం రూరల్ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రిటైర్డ్ టీచర్ మండల శ్రీరామ్మూర్తి విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఉద్యోగ విరమణ చేసిన శ్రీరామ్మూర్తి చీడికాడ మండలం కొత్తపల్లిలో ప్రాథమికోన్నత పాఠశాలలో వలంటీర్‌గా తరగతులు చెబుతున్నారు. ఈ నెల 3న ఉదయం సమయంలో తన స్కూటీపై కొత్తపల్లి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. గాయపడిన ఆయనను అనకాపల్లి ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చి, పరిస్థితి విషమించడంతో విశాఖకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తుది శ్వాస విడిచారు. మృతుని స్వగ్రామంలో అంత్యక్రియలు జరిపారు. అతడి నేత్రాలు ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి దానం చేశారు. ఈ మేరకు చోడవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

మానసిక ఒత్తిడితో విద్యార్థిని ఆత్మహత్య



మౌనిక (ఫైల్)

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి థెరిస్సా కాలనీలో ఇంజినీరింగ్ విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. టౌన్ ఎస్‌ఐ గోవిందరావు అందించిన వివరాలివి. థెరిస్సా కాలనీలో నివాసం ఉంటున్న మంత్రి సత్యనారాయణ, భవానీ దంపతుల కుమార్తె మంత్రి మౌనిక(23) కాకినాడ జేఎన్‌టీయులో ఎంఎస్సీ చదువుతున్నది. అనారోగ్యం కారణంగా రెండు నెలల నుంచి తల్లి దండ్రుల వద్ద ఉంటుంది. రకరకాల కారణాలతో మౌనిక కొంతకాలంగా మానసిక ఒత్తిడితో బాధపడుతుంది. ఈ నేపథ్యంలో శనివారం తల్లిదండ్రులు పని నిమిత్తం బయటకు వెళ్లారు. తల్లిదండ్రులు లేని సమయం చూసుకుని మౌనిక ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి భవానీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సమీపంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. చేతికి అందివచ్చిన ఒకగాని ఒక కూతురు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలని వినతి

మంత్రి కొట్టు సత్యనారాయణను కలిసిన ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, బొడ్డేడ



మంత్రి సత్యనారాయణకు వినతి అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, బొడ్డేడ ప్రసాద్

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులోని దేవదాయ శాఖ స్థలంలో కలియుగ దైవం వేంకటేశ్వరుని ఆలయం, మహా గణపతి, రామాలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు శనివారం వినతి అందజేశారు. యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ఆధ్వర్యంలో ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, పార్టీ నాయకులు మంత్రిని శనివారం అమరావతిలో కలిశారు. మునగపాకలోని దేవదాయ భూమిలో కొంత భాగాన్ని కేటాయించాలన్నారు. ఇప్పటికే రూ.50 లక్షల మేర డిపాజిట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, ఆలయ నిర్మాణానికి కామన్ గుడ్ ఫండ్(సీజీఎఫ్) ద్వారా నిధులు మంజూరుకు సహకరించాలని కోరారు. జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కోనపల్లి రామ్మోహనరావు, పెద్దలు పెంటకోట వెంకట్, కాండ్రేగుల జగ్గారావు, వెలగా శ్రీనివాసరావు తదితరులున్నారు.

జిల్లాకు రూ.248.14 కోట్ల 'ఆసరా'

ఎస్.రాయవరం: జిల్లాకు ఆసరా పథకం కింద మూడో విడతగా రూ.248.14 కోట్లు విడుదల కానున్నట్టు డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి బి.లక్ష్మీపతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికే రెండు సార్లు వైఎస్సార్ ఆసరా నిధులు మంజూరు చేసిందని తెలిపారు. మూడవ విడత నిధులను ఈ నెల 25న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నారని, ఆ నగదు వారం,పది రోజుల వ్యవధిలో లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతుందన్నారు. జిల్లాలో 31,879 సంఘాల సభ్యులకు లబ్ధి చేకూరనుందని చెప్పారు. జిల్లాలో అత్యధిక రుణమాఫీ జరిగిన మండలాల్లో ఎస్.రాయవరం మండలం ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఎస్.రాయవరం మండలంలోని 1851 సంఘాలకు గాను రూ.16,45,49,104 విడుదల కానున్నట్టు తెలిపారు. బ్యాంకుల నుంచి ప్రస్తుతం స్వయం సహాయక సంఘాలకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణం మంజూరు కానున్నట్టు చెప్పారు. ఒక్కో సభ్యురాలికి రూ. లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు రుణం మంజూరయ్యే అవకాశం ఉందన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఉరుసు



దర్గాను సందర్శించిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు

కశింకోట: నరసింగబిల్లి వద్ద ఉన్న హజరత్ కాలే షా వలి బాబా దర్గా ఉరుసు షరీఫ్ శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని ముస్లింలు, స్థానిక హిందువులు దర్గాను దర్శించి ప్రార్థనలు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దాడి వీరభద్రరావు తదితరులు దర్గాను సందర్శించారు. ముందుగా గౌస్ పాక్ జెండా ప్రతిష్ఠించి ఊరేగింపు నిర్వహించారు. దర్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ గౌస్ అహ్మద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం



అచ్చెర్లలో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో కొంకి అప్పారావు

కశింకోట: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో కొంకి అప్పారావు లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని అచ్చెర్లలో లే–అవుట్‌ను శనివారం ఆయన సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడారు. సకాలంలో గృహాలు నిర్మించకపోతే రద్దు అవుతాయన్నారు. సర్పంచ్ నిమ్మదల సోమేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మహేష్, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వద్ద మొక్కలు నాటే కార్యక్రమం



కశింకోట పీహెచ్‌సీని ఆనుకొని మొక్కలు నాటుతున్న ఎంపీడీవో కొంకి అప్పారావు

కశింకోట: స్థానిక పీహెచ్‌సీని ఆనుకుని జాతీయ రహదారి పక్కన శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీవో కొంకి అప్పారావు ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వంట పాత్రల వితరణ

కశింకోట: స్థానిక పురాతన శివాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే అన్న సమారాధనకు అవసరమయ్యే పాత్రలను శనివారం వితరణ చేశారు.అవసరాల ప్రసాద్ వీటిని ఆలయ అర్చకుడు వి. శంకరరావుకు అందజేశారు. ఇందుకు అన్న సమారాధన బృందం కృతజ్ఞతలు తెలిపింది.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 5,323 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,650	4,100
మొదటి రకం	3,600	3,890
రెండో రకం	3,450	3,700
మూడో రకం	3,200	3,420

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
ఫలానా అబ్బాయి	
ఫలానా అమ్మాయి	సత్యనారాయణస్క్రీన్-1
మనసిస్తావా	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్ధిసాయి
షజామ్	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
జంతు ప్రపంచం	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్–4 యూనిట్లు, ఎ నెగిటివ్–1 యూనిట్, బి పాజిటివ్–17 యూనిట్లు, బి నెగిటివ్–1 యూనిట్, ఒ పాజిటివ్ 9 యూనిట్లు, ఒ నెగిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్ 9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 359 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 9441108144)ని సంప్రదించవచ్చు.

ఇక్కడ నివాసం పెద్ద ప'రిక్షా'

ఇక్కడ నివసించే వారంతా నిరు పేదలు...రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వారివి. దీనికి తోడు కనీస సౌకర్యాలు కరవై వారు నిత్యం అవస్థలకు గురవుతున్నారు. రోడ్లు, డ్రైనేజీలు లేవు. గుక్కెడు నీటి కోసం నిత్యం దేవులాడుకోవలసిన పరిస్థితి. రాత్రయితే చాలు అంధకారంలో మగ్గిపోవలసిందే. చుట్టూ ఉన్న తుప్పల్లోంచి ఎప్పుడు ఏ విష కీటకం ఇళ్లలోకి ప్రవేశిస్తోందనన్న భయాందోళనతో రిక్షా కాలనీ వాసులు జీవనం సాగిస్తున్నారు.

- అంధకారంలో కాలనీ
- గుక్కెడు నీటికోసం అవస్థలు



రిక్షా కాలనీ

తుమ్మపాల: అనకాపల్లి పట్టణానికి చెందిన 49 మంది నిరుపేద రిక్షా కార్మికులకు మండలంలోని రేబాక పంచాయతీ గురజాడనగర్ శివారులో ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. దీంతో వారంతా అక్కడ క్రమేణ గృహాలు నిర్మించుకుని నివాసముంటున్నారు.

అనకాపల్లి – గోపాలపురం రహదారికి అనుకుని ఏర్పాటుచేసిన ఈ కాలనీలో రోడ్డుకు అనుకుని ఉన్న నిర్మాణాలకు విద్యుత్, నీటి సౌకర్యం ఉన్నప్పటికీ వెనుక వైపు కొండకు ఆనుకుని ఉన్న దాదాపు 30కి పైగా గృహాలకు ఆ సౌకర్యాలు లేవు. రోడ్లు, డ్రైనేజీల పరిస్థితి మరీ ఘోరం. ఇక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడంతో కొంతమంది రిక్షా కార్మికులు పట్టణంలో మురికివాడల్లో నివాసముంటున్నారు.

కాలనీ ఏర్పడి 30 ఏళ్లు..

రిక్షా కాలనీ ఏర్పాటు చేసి దాదాపు 30 ఏళ్లు పూర్తవుతోంది. ఇక్కడ నివాసముంటున్న దాదాపు 30 కుటుంబాలు ఇప్పటికీ చీకటిలోనే కాలంగడుపుతున్నాయి. కాలనీ చుట్టూ తుప్పలు ఎక్కువగా ఉండడంతో పాములు, విష కీటకాలు ఇళ్లలోకి ప్రవేశిస్తాయేమోని నిత్యం ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణం.

గుక్కెడు నీటి కోసం అవస్థలు : కాలనీలో ఒక్క తాగునీటి కుళాయి కూడా లేదు. నీరు కావాలంటే అర కిలోమీటరు దూరం నుంచి బిందెలు, డబ్బాలతో తెచ్చుకోవలసిందే. కొన్ని సార్లు డ్రమ్ములతో నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది.

ఇబ్బందులు పడుతున్నాం..



కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని, మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని స్పందనలో అర్జీ అందజేశాం. ఎవరూ పట్టించుకోలేదు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రులు చాలా ఇబ్బందులు పడుతున్నాం. మంచినీటి కోసం చాలా దూరం వెళ్లవలసి వస్తోంది.

– ఎం.దేవి, గృహిణి, రిక్షా కాలనీ

విద్యుత్ సౌకర్యంపై తీర్మానం చేస్తాం

విద్యుత్ సౌకర్యం కల్పనపై పంచాయతీ సమావేశంలో తీర్మానం చేసి, ఆ శాఖకు నివేదిక అందజేస్తాం. ఇటీవల అక్కడ 300 మీటర్ల పొడవు గల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాం. మంచినీటి సౌకర్యం క్రమేణ ఏర్పాటు చేస్తున్నాం.

– బి.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, రేబాక

పొలం బడిలో పాఠాలు

- క్షేత్రస్థాయిలో సాగుపై పరిశీలన
- నేర్పుతూ..నేర్చుకున్న వ్యవసాయ విద్యార్థినులు



తుమ్మపాలలో రైతులకు చీడపీడల నివారణపై వివరిస్తున్న వ్యవసాయ విద్యార్థినులు



రైతులకు పురుగుమందు పిచికారీలో జాగ్రత్తలు తెలిజేస్తున్న విద్యార్థినులు

అనకాపల్లి రూరల్: వారంతా వ్యవసాయ విద్యార్థినులు... తరగతి గదిలో వారు నేర్చుకున్న అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఏర్పర్చుకునేందుకు రైతులతో కలిసి పొలంబాట పట్టారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ,నైరా వ్యవసాయ కళాశాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు క్షేత్ర పర్యటనలో భాగంగా అనకాపల్లి మండలం తుమ్మపాలలో పంటపొలాలను శనివారం సందర్శించారు. ఈ ప్రాంతంలో సాగు చేస్తున్న వివిధ రకాల పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. పంటలకు పురుగు మందులను పిచికారీ చేసేటప్పుడు తప్పనిసరిగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గాలి వాటం చూసుకుని పిచికారీ చేసే మందు తమపై పడకుండా జాగ్రత్త వహించాలని, నిర్ణీత వేళల్లో పురుగు మందు పిచికారీ చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందని వివరించారు. మరో బ్యాచ్ విద్యార్థినులు పంటల్లో రసం పీల్చే పురుగులను సులభంగా నివారించడానికి జిగురు అట్టలను ఎలా వినియోగించాలో ప్రయోగాత్మకంగా తెలియజేశారు. బెండ,వరి,టమాటా,మిరప,మినుము,పెసలు,వేరుశనగ, నువ్వు పంటల్లో పసుపు రంగుజిగురు అట్టలను వినియోగిస్తే మంచి ప్రయోజనం ఉంటుందని,సులభంగా పురుగు ఉధృతిని గుర్తించవచ్చని వారికి తెలిపారు.పత్తి,వరి,ఉల్లి పంటలకు ఎకరానికి 10 చొప్పున నీలిరంగు జిగురు అట్టలను ఉంచడం వల్ల మంచి ఫలితం ఉంటుందన్నారు. క్షేత్ర పర్యటనల ద్వారా చాలా విషయాలు తెలుసుకునే అవకాశం కలిగిందని విద్యార్థినులు పి.శ్రీ వర్షిణి, పి.నిమిష,బి.సౌమ్యశ్రీ, వి.సౌమ్య, ఎస్.సువర్ణ ఆనందం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా వైద్య సేవలు



సూచనలు చేస్తున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా రోగులకు వైద్య సేవలందించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. గునుపూడి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పీహెచ్‌సీకి సంబంధించి ప్రధాన సమస్యలను వైద్యాధికారి ఎం. సురేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ సమావేశ మందిరం లేక ఇబ్బందిగా ఉందన్నారు. పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమావేశ మందిరం నిర్మాణానికి మండల పరిషత్ జనరల్ ఫండ్ నిధులు మంజూరు చేస్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు. దీనికి సంబంధించి ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. పేదోడికి ఇంటి వద్దే వైద్యం అందించాలన్న కృతనిశ్చయంతో కొత్తగా ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు వీటిన్నింటిని దృష్టిలో ఉంచుకుని పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వైద్య సేవలు అంకిత భావంతో అందించాలన్నారు. వారి పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్ణీత సమయం ప్రకారం నిర్వహించడం వల్ల లోటుపాట్లు సరి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. పీహెచ్‌సీలో సామగ్రి, ఇతర సమస్యల పరిష్కారానికి పీహెచ్‌సీ అభివృద్ధి నిధులతో చేయడానికి నిర్ణయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి వి. పద్మప్రియ, ఆరోగ్య విస్తరణాధికారి నాగేశ్వరరావు ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌కార్డుదారులకు ఉపాధి పనులు



ఎ.భీమవరం గుండాల చెరువులో ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న ఏపీవో వసంత్

కె.కోటపాడు: మండలంలోని 32 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులకు జాబ్‌కార్డుదారులు హాజరు కావాలని ఏపీవో వసంత్ కోరారు. ఎ.భీమవరంలో గుండాల చెరువు, సూదివలస గ్రామాల్లో ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనదారుల రోజు వారి గరిష్ట వేతనం రూ.257 పొందేలా పనులు చేయాలన్నారు. స్వగ్రామాల్లోనే ఉపాధి పనులకు వేతనదారులు హాజరు కావడం వల్ల పనితోపాటు గ్రామాభివృద్ధి చెందుతుందన్నారు. ఎ.భీమవరంలో గుండాల చెరువులో పూడికతీత, చెరువుగట్టు పటిష్టత పనులు రూ.3.50 లక్షల ఉపాధి నిధులతో చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భీమరాజు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవాలు



సాంబశివున్ని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : మునగపాకలో సాంబశివుని ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సాంబశివున్ని దర్శించుకునేందుకు భక్తులు తరలి వచ్చారు. భక్తులకు సదుపాయాలు కల్పించడానికి ఆలయ ఛైర్మన్ బూడిద శ్రీనివాసరావు తగు చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిగింది. అలాగే స్థానిక పల్లపు వీధిలోని వినాయక ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వినాయకుడిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయం మార్పు తగదు

తుమ్మపాల: పట్టణంలో రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం మార్పు యోచన విరమించుకోవాలని బీఎస్పీ నేత సూధికొండ మాణిక్యాలరావు జిల్లా రిజిస్ట్రార్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న భవనం పట్టణంలో అన్ని వసతులతో ఉందని, ఇక్కడ నుంచి కొత్తూరు పంచాయతీకి మార్చడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని చెప్పారు. కనీస సౌకర్యాలు లేని ప్రాంతానికి మార్చడంపై అధికారులు పునరాలోచించాలన్నారు. పాత రిజిస్ట్రేషన్ కార్యాలయ స్థలంలో నూతన భవనాన్ని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

సక్రమంగా మధ్యాహ్న భోజన పథకం అమలు



వంటకాలను పరిశీలిస్తున్న ప్రేమ్‌కుమార్

అనకాపల్లిటౌన్: మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని డిప్యూటీ డీఈవో ప్రేమ్ కుమార్ ఆదేశించారు. జీవీఎంసీ బాలుర(మెయిన్) స్కూల్‌ను ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. బైజూస్‌ట్యాబ్‌లు విద్యార్థులు ఏ విధంగా వినియోగిస్తున్నదీ పరిశీలించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను చెక్ చేసి, తప్పులుండడంతో ఉపాధ్యాయులపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

కూల్.. కూల్..

అనకాపల్లిటౌన్/కశింకోట: అనకాపల్లి పట్టణంలో శనివారం వాతావరణం కూల్ కూల్‌గా మారింది. పదిహేనురోజుల నుంచి సూర్యుడి ప్రతాపంతో అల్లాడుతున్న ప్రజలకు చిరుజల్లుల పలకరింపు సాంత్వన చేకూర్చింది. వేసవితాపం నుంచి ఉపశమనం పొందారు. కశింకోట మండలంలో వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. ప్రజలు ఉపశమనం పొందారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



పరీక్షలు రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

అనకాపల్లిటౌన్: పట్టణంలో శనివారం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఏడు పరీక్ష కేంద్రాలకు 2,988 మంది విద్యార్థులకు గాను 2,948 మంది హాజరయ్యారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్‌ను పటిష్టంగా అమలు చేశారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులను అందిస్తున్న సర్పంచ్ దేముళ్లు, సాయికుమార్

కె.కోటపాడు: చదువుతోపాటు క్రీడల్లోను యువకులు రాణించాలని సర్పంచ్ బండారు దేముళ్లు ఆకాంక్షించారు. గుల్లేపల్లి గ్రామానికి చెందిన పశు వైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ రూ.10 వేలతో 12 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తుల తోపాటు రెండు వాలీబాల్‌లను సమకూర్చారు. తన తాతయ్య స్వర్గీయ రెడ్డి రాము జ్ఞాపకార్థంగా వీటిని అందించినట్లు తెలిపారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



జి.భీమవరంలో నిర్వహిస్తున్న చిరు ధాన్యాల దినోత్సవ ర్యాలీ

కశింకోట: చిరు ధాన్యాలు వినియోగించి ఆరోగ్యాన్ని పొందాలని వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని జి.భీమవరంలో చిరు ధాన్యాల దినోత్సవాన్ని శశనివారం నిర్వహించారు. ఈసందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ర్యాలీ నిర్వహించి చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరూ చిరు ధాన్యాలను వినియోగించాలన్నారు. పిల్లలకు వీటి ప్రాధాన్యతను తెలియజేసి ఆహారంగా అందించాలన్నారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయాలని మహిళలు, రైతులను కోరారు. సర్పంచ్ హనుమంతు వెంకటలక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు అల్లం శంకరరావు, పంచాయతీ కార్యదర్శి చిన్నోడు, ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి డి.రమణ, సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

25న వైఎస్సార్ ఆసరా నగదు జమ



సర్పంచ్ హనుమంతు వెంకటలక్ష్మణరావుకు లబ్ధిదారుల జాబితా అందజేస్తున్న ఏపీఎం

కశింకోట: మండలంలోని జి.భీమవరం సచివాలయ పరిధిలో మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం నిధుల విడుదలపై స్వయం సహాయక సంఘాల మహిళలకు శనివారం అవగాహన కల్పించారు. అర్హత ఉన్న స్వయం సహాయక సంఘాల ఖాతాలకు ఈ నెల 25న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేరుగా సొమ్ము జమ చేస్తారని వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. జి.భీమవరం పరిధిలో 81 సంఘాల్లోని 1001 మంది లబ్ధిదారులకు రూ.84 లక్షల ఆసరా సొమ్ము రానుందన్నారు. లబ్ధిదారుల జాబితా పత్రాలను సర్పంచ్ హనుమంతు వెంకట లక్ష్మణరావుకు అందజేశారు. సచివాలయ నోటీసు బోర్డులో జాబితాను అందుబాటులో ఉంచారు.మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, వీవోఏలు కుమారి, లక్ష్మి మౌనిక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనేతరుడికి కొమ్ము కాస్తున్న రెవెన్యూ

పెద్ద ఎత్తున ఆదివాసీల ర్యాలీ, ధర్నా



మాట్లాడుతున్న ఉద్యమ నాయకుడు అజయ్‌కుమార్

రోలుగుంట: తరతరాలుగా సాగులో ఉన్న ఆదివాసీలకు నష్టం కలిగిస్తూ గిరిజనేతరుడికి కొమ్ము కాస్తున్న రెవెన్యూ యంత్రాంగం తీరును నిరసిస్తూ శనివారం అఖిల భారత ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గిరిజనులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామీణ బ్యాంకు నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శన చేశారు. చటర్జీపురం గదబ ఆదివాసీ కుటుంబాలకు న్యాయం చేయాలని, సాగులో ఉన్న వారి పేర్లను తొలగించి గిరిజనేతరుడు పేరును పొందుపరిచిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత్ ఆదివాసీ సంఘం నాయకుడు పి.ఎస్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎం.కె.పట్నం రెవెన్యూ సర్వే నంబర్ 139లో పదెకరాల మెట్ట భూమిలో చటర్జీపురానికి చెందిన నాలుగు గదబ ఆదివాసీ కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. గత తహసీల్దార్ ఈ వాస్తవాన్ని గుర్తించి వారి పేర్లను సాగుదారులుగా నమోదు చేశారన్నారు. ప్రస్తుతం కాకినాడ జిల్లాకు చెందిన గిరిజనేతరుడి పేరును రికార్డులో చేర్చారని తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావుకు స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. అక్కడ వాస్తవాల అమలుకు తహసీల్దార్ భిన్నంగా వ్యవహరిస్తుండటంతో ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. న్యాయం చేసే వరకూ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. గొలుగొండ, నాతవరం తదితర మండలాల నుంచి ఆదివాసీలు మద్దతు పలికారు. అనంతరం వినతి పత్రాన్ని రెవెన్యూ కార్యాలయంలో అందజేశారు.

వేసవిలో పశు సంరక్షణపై అవగాహన



అవగాహన సదస్సులో ఏడీ చిట్టినాయుడు

మాడుగుల: వేసవిలో ప్రతి రైతు పశు సంరక్షణ గురించి తెలుసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు సూచించారు. శనివారం స్థానిక పాల కేంద్రం వద్ద రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తీవ్రమైన ఎండలు వల్ల అధిక తాపానికి పశువులు ఉత్పాదక శక్తి కోల్పోతాయన్నారు. ఈ తాపానికి పశువులు మృత్యువాత పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువులను ఉదయం, సాయం కాలం వేళలో మేతకు పంపాలన్నారు. ప్రతి పశువుకు రోజుకు 60 నుంచి 70 లీటర్ల నీరు అందించాలన్నారు. పశువులకు రోగాలు వస్తే టోల్ ఫ్రీ నంబరు 1962కు ఫోన్ చేస్తే పశు అంబులెన్స్ వచ్చి ప్రాథమిక చికిత్స అందిస్తుందన్నారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ అధ్యక్షుడు రావెలపూడి సూరిబాబు, వేతన కార్యదర్శి జోగినాయుడు పాల్గొన్నారు.

త్వరితగతిన భవనాల పూర్తిపై డీపీవో అభినందన



తైపురంలో హెల్త్ భవనాన్ని పరిశీలిస్తున్న డీపీవో

బుచ్చెయ్యపేట: తైపురంలో ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయడంపై జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఆమె ఇక్కడ పర్యటించి సచివాలయ, రైతు భరోసా, హెల్త్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు ఉపయోగపడే మూడు భవన నిర్మాణ పనులు పూర్తి చేయడంతో అధికారులను, నాయకులను అభినందించారు. త్వరలోనే మూడు భవనాలను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మండల నాయకులతో కలిసి ప్రారంభోత్సవాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను వివరించారు. గ్రామంలో 44 జగనన్న ఇళ్లకు 39 ఇళ్లు పూర్తి చేయడంతో అధికార్లను డీపీవో అభినందించారు. మిగిలిన ఐదు ఇళ్లు పూర్తి చేయించాలని ఎంపీడీవో సువర్ణరాజు, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, హౌసింగ్ ఏఈ గోపీనాథ్‌లకు సూచించారు. మాజీ సర్పంచ్ దేగల అప్పారావు, వడ్డాది ఈవో లోవరాజు, పంచాయతీ సెక్రటరీ విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో గ్లకోమా నివారణ

నక్కపల్లి : ముందు జాగ్రత్తలతో గ్లకోమాను నివారించవచ్చని గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్, నక్కపల్లి ఆప్తాల్మిక్ అధికారి మజ్జి గణపతిరావు సూచించారు. గ్లకోమా వారోత్సవాల సందర్భంగా శనివారం నక్కపల్లి సచివాలయంలో అవగాహన శిబిరం నిర్వహించారు. 40 ఏళ్లు నిండిన వారందరూ కంటి పరీక్షలతో గ్లకోమా పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. కంటి నరాల్లో ఒత్తిడి వల్ల గ్లకోమా వచ్చే అవకాశం ఉందన్నారు. నరాల్లో ఏర్పడిన ఒత్తిడి వల్ల రెటీనా దెబ్బతిని కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కంటి నరాలపై ఒత్తిడి తగ్గించుకోవాలన్నారు. ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా గ్లకోమాకు కూడా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తోందన్నారు. గ్లకోమా నిర్ధారణ కోసం అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక నుంచి అనకాపల్లిలో కూడా గ్లకోమా శస్త్రచికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. గ్లకోమాపై గ్రామాల్లో కూడా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకే ప్రభుత్వం వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఈ కార్యక్రమంపై ప్రచారం చేయాలన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 55 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వీసం నానాజీ, 104 వైద్యాధికారి డాక్టర్ కీర్తి, ఉప సర్పంచ్ వీసం రాజు, వైద్యసిబ్బంది త్రినాథ్, రత్నం, రూన్సీ,రత్నం, నవరంజని విజయలక్ష్మి పాల్గొన్నారు.